క్లుప్తంగా

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక వేషధారణలో విద్యార్థులు

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని బడంగ్‌పేట లార్డ్స్‌ ఒలంపియాడ్‌ వార్షికోత్సవాన్ని రిథమ్‌–2025 పేరుతో బుధవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి నిర్వాహకులు వేడుకలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా గాంధీ ఆస్పత్రి సీనియర్‌ వైద్యులు శ్రవన్‌ కుమార్‌, నీలోఫర్‌ ఆస్పత్రి వైద్యులు మాధురి రెడ్డి, మన్నె నరేశ్‌, ఈ అభ్యాస్‌ అధినేత డా.ఫణిపవన్‌ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక విన్యాసాలు, డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్‌ సిద్దాల బీరప్ప, వైస్‌ చైర్మన్‌ బైర్లు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌ శ్రీలత, డీన్‌ సతీశ్‌కుమార్‌, ఐఐటీ ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ రెడ్డి, సంతోష్‌, రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

17న తైబజార్‌ వేలం

తుక్కుగూడ: తుక్కుగూడ, రావిర్యాల తైబజార్‌(వారపు సంతల) 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ నెల 17న ఉదయం 11 గంటలకు పుర కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ ఏ.వాణి తెలిపారు. బుధవారం పుర కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రతీ ఆదివారం జరిగే రావిర్యాల వారపుసంత, ప్రతీ సోమవారం జరిగే తుక్కుగూడ వారపు సంతలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేలంలో పాల్గొనేవారు ఈ నెల 6 నుంచి 13వ తేదీవరకు రూ.1000 చెల్లించి పుర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తుక్కుగూడ వేలంలో పాల్గొనేవారు రూ.2లక్షల సాల్వేని, రావిర్యాల వేలంలో పాల్గొనేవారు రూ.50వేల సాల్వేని మున్సిపల్‌ కమిషనర్‌ తుక్కుగూడ పేరు మీదా నేషనల్‌ బ్యాంకు నందు డీటీ తీయాలన్నారు. వేలంలో దరఖాస్తు ఫారం, సాల్వేని సర్టిఫికెట్‌ను కార్యాలయంలో మేనేజర్‌కు అందజేయాలని తెలిపారు.

పోస్టల్‌, టెలికాం కాలనీ అధ్యక్షుడిగా నర్సింగ్‌రావు

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని గుర్రంగూడ పోస్టల్‌ అండ్‌ టెలికాం ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని రెండు సంవత్సరాలకుగాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా డి.నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడిగా వి.పర్వతాలు గౌడ్‌, ప్రధాన కార్యదర్శిగా ఎం.చంద్రయ్య గౌడ్‌, జాయింట్‌ సెక్రటరీగా ఎస్‌.శత్రుఘ్నరాజు, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా బి.శివశంకర్‌నాయక్‌, కోశాధికారిగా వి.మల్యాద్రి, ఉపకోశాధికారిగా సంతురెడ్డి, కార్యవర్గ సభ్యులుగా విష్ణువర్ధన్‌ రెడ్డి, దినేశ్‌, గోపీనాథ్‌, శర్మ తదితరులను ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని, నియామకానికి పూర్తి సహకారం అందించిన కాలనీవాసులకు నర్సింగ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్‌:మరమ్మతుల కారణంగా గురువారం 11కేవీ కమలానగర్‌, భవ్య హాస్పిటల్‌ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్‌ డివిజినల్‌ ఇంజినీర్‌ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలకు టేబుళ్ల అందజేత



పాఠశాలకు టేబుళ్లు అందజేస్తున్న అసోసియేషన్‌ సభ్యులు

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మ్యాక్‌ బీటీఆర్‌ ఓనర్స్‌, వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు బుధవారం టేబుళ్లు అందజేశారు. ఈ మేరకు వాటిని ఉపాధ్యాయులకు అప్పగించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి బీటీఆర్‌ ఓనర్స్‌, వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ముందుంటుందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ సభ్యులకు పాఠశాల సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాతలు డిజే.జగన్నాథరాజు, ఎస్‌.సింహారెడ్డి, బీటీఆర్‌ ఓనర్స్‌, వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు జీఎస్‌ఎన్‌.రెడ్డి, కె.నాగేశ్వర్‌రావు, ఎన్‌.చంద్రశేఖర్‌, పాఠశాల హెచ్‌ఎం రవిప్రకాశ్‌, పాఠశాల పూర్వ విద్యార్థులు యాదగిరి, బాబు పలువురు పాల్గొన్నారు.

గ్రాసానికి గడ్డు కాలం

- మిషన్లతో వరికోత పశువులకు గడ్డి కొరత
- ట్రాక్టర్‌ గడ్డి ధర రూ.15 నుంచి రూ.20వేలు పలుకుతున్న వైనం
- పాడి రైతులకు తప్పని కష్టాలు
- ప్రత్యామ్నాయంగా పచ్చిమేతను వేసుకోవాలంటున్న పశువైద్యాధికారులు



పంట పొలాల వద్ద వరి ఎండుగడ్డిని నిల్వ చేసుకున్న పాడి రైతు



లారీల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వరి ఎండుగడ్డి

మహేశ్వరం: పాడి రైతులకు గడ్డు రోజులు ఎదురవుతున్నాయి. ఎండుగడ్డి కొరత తీవ్రంగా ఉండడంతో పశుపోషణ రోజురోజుకు భారంగా మారుతోంది. కూలీల కొరత తీవ్రంగా వేధిస్తుండడంతో పశుగ్రాసం కొరత తీవ్రమవుతోంది.

కూలీల కొరతతో..

మండలంలోని పాడిపై ఆధారపడి రైతులు ఎక్కువగానే ఉన్నారు. ప్రతి ఏడాది ఖరీఫ్‌, రబీ సీజన్‌లలో వచ్చే వరిగడ్డి పశువుల మేతకు రైతులు ఉపయోగిస్తారు. వరి సాగు చేసిన రైతులు కూలీలతో పంటను కోయించకుండా వరి కోత మిషన్లు(హార్వేష్టర్స్‌)తో వరి పంటలను కోయిస్తున్నారు. దీంతో వరి ఎండుగడ్డి కూలీలతో కోయించినంత వరి కోత మిషన్లతో రాదు. కొందరు రైతులు గడ్డిని పంట పొలాల్లోనే దగ్ధం చేస్తున్నారు. మండలంలో ఇదివరకు అన్ని గ్రామాల్లో వరి పంటను సాగు చేయడంతో వరి గడ్డి పుష్కలంగా లభించేది. ఇప్పుడు కొందరే సాగు చేయడంతో వరిగడ్డి కొరత తీవ్రంగా ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో వరిసాగు చేయగా, మరి కొన్ని గ్రామాల్లో రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న పాడి రైతులు వరి గడ్డి కోసం ఇతర జిల్లాలు, పక్క మండలాల నుంచి లారీలు, ట్రాక్టర్లలో తెచ్చుకుంటున్నారు. వరిగడ్డి కొరత ఎక్కువగా ఉండడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. పాడి రైతులు వరి గడ్డిని కొనలేక ఎక్కువ శాతం పచ్చిమేత, సొప్ప మీద ఆధారపడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా వివిధ దాణాలు..

వరిగడ్డి ధరలు ఈ సీజన్‌లో రెట్టింపు ధర పలుకుతుంది. గతంలో ఒక ట్రాక్టర్‌ వరి గడ్డి రూ.6వేల నుంచి రూ.10వేల వరకు కాగా, ఈ సీజన్‌లో రూ.15వేల నుంచి రూ.20వేలు, లారీ వరిగడ్డి సుమారు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు పెరిగింది. దీంతో రైతులకు వరిగడ్డి దొరకక పశుపోషణ భారంగా మారింది. పాడి రైతులు వరి గడ్డి ధరలు విపరీతంగా పెరగడంతో ప్రత్యామ్నాయంగా సొప్ప కుట్టీ, పచ్చిగడ్డి గ్రాసాలతో పాటు దాణాలను వాడుతున్నారు.

కొండెక్కిన పశువుల దాణా ధరలు..

మార్కెట్‌లో పశువుల దాణా ధరలు విపరీతంగా పెరిగాయి. శనగ చెక్క, కొబ్బరిపిట్టు, పెసర పొట్టు, గోధుమ పొట్టు, పత్తి చెక్క, మినపపొట్టుతో పాటు పలు దాణా రకాల ధరలు పెరిగాయి. కొంత మంది పాడి రైతులు పాల నుంచి లాభాలు రాకున్నా పశువులకు అప్పులు చేసి పశుగ్రాసం, దాణాలు పెడుతున్నారు. గతంలో పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు గడ్డి విత్తనాలు సబ్సిడీపై అందజేసేవారు. అధికారులు అక్కడక్కడ కొన్నిచోట్ల పంపిణీ చేసి, అయిపోయాయని పశు ఆస్పత్రులకు వచ్చే రైతులకు చెబుతున్నారు.

కొనలేని పరిస్థితి



ఈ సంవత్సరం వరి ఎండు గడ్డి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రోజు పశువులకు పచ్చిమేతతో పాటు కొంత వరి ఎండు గడ్డి వేసేవాళ్లం. ఇప్పుడు ఎండు గడ్డి ధరలు పెరగడంతో కొనలేని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితిలో ఎండు గడ్డిని అప్పులు చేసి అధిక ధరకు కొనుగోలు చేసి పశువులకు మేతగా వేస్తున్నాం.

– అబ్బేసి ఆనంద్‌, పాడి రైతు, గొల్లూరు

భారంగా పశుపోషణ



కూలీల కొరత కారణంగా వరి ఎండుగడ్డికి భారీగా డిమాండ్‌ పెరిగింది. దీంతో ప్రత్యామ్నాయంగా సొప్ప, కుట్టీ, పచ్చిమేతతో పాటు ఇతర పశుగ్రాసాలను పశువులకు మేతగా వేస్తున్నాం. ప్రస్తుతం దాణా ధరలు విపరీతంగా పెరగడంతో పశుపోషణ పాడి రైతులకు భారంగా మారింది. పాడి పరిశ్రమతో నష్టాలు వస్తున్నా నెట్టుకొస్తున్నాం.

– ఎర్ర శంకరయ్య, పాడి రైతు, ఘట్టుపల్లి

పచ్చిమేత వేసుకోవాలి



ఎండుగడ్డి లేని సమయంలో పచ్చిమేత సొప్ప, నేపీయర్‌ గడ్డి, సుభాబుల్‌, దిరిసన, అవిస ఆకులు పశువులకు వేస్తే మంచి పోషకాలు లభిస్తాయి. ఎండు గడ్డిని వరి పంట కోయగానే నిల్వ చేసుకుంటే కొరత ఉన్న సమయంలో పాడి రైతులకు ఉపయోగపడుతుంది. ఈ సీజన్‌లో ఎండు గడ్డికి డిమాండ్‌ ఎక్కువగా ఉంటుంది.

– విశ్వేశ్వర్‌, పశువైద్యాధికారి, దుబ్బచర్ల

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్‌, కేఎల్లార్‌

తుక్కుగూడ: రాష్ట్ర ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీలో పర్యటిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్‌ తెలిపారు. బుధవారం జెన్నాయిగూడ గ్రామంలో లెన్స్‌కార్ట్‌ పరిశ్రమను ఏర్పాటు చేసే స్థలాన్ని, డీసీపీ భవనం నిర్మించే స్థలాన్ని రాచకొండ పోలీస్‌ కమిషనర్‌ సుధీర్‌బాబుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జెన్నాయిగూడ గ్రామంలో ప్రపంచస్థాయి హంగులతో ఏర్పాటు చేసే పరిశ్రమ లెన్స్‌కార్ట్‌ అన్నారు. ఫోర్త్‌సిటీలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా డీసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. వీటి పనుల శంకుస్థాపనతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగ జంగారెడ్డి, నర్సింహ్మా, కష్ణానాయక్‌, ఈశ్వర్‌, పాండురంగారెడ్డి, రాజ్‌కుమార్‌, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని ప్రత్యేక అథారిటీలో కలపాలి

- కేఎల్లార్‌కు నేదునూరు గ్రామ నాయకుల వినతి



మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేదునూరు వాసులు

కందుకూరు: తమ గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్‌ సిటీ ప్రత్యేక అథారిటీలో కలపాలని కోరుతూ మండల పరిధిలోని నేదునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ నాయకులు, గ్రామస్తులు బుధవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్‌ తదితరులు మాట్లాడుతూ.. కందుకూరు మండలంలోని చాలా గ్రామాలను ప్రత్యేక అథారిటీలోకి చేరుస్తున్నారని, సమీపంలో ఉన్న తమ గ్రామాన్ని కూడా కలపాలని కోరామన్నారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు సాధ పాండురంగారెడ్డి, ఎస్‌.అమరేందర్‌రెడ్డి, ఐ.రాకేశ్‌గౌడ్‌, జి.మాధవరెడ్డి, బి.సురేశ్‌, ఎ.దర్శన్‌, ఎస్‌.కృష్ణనాయక్‌, ఎ.వెంకటయ్య, కె.మహేందర్‌, పాండు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌

నందిగామ: గత పదేళ్ల అధికారంలో ఉండి బీఆర్‌ఎస్‌ చేయలేని అనేక అభివృద్ధి పనులను షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ కేవలం 15 నెలల కాలంలో చేసి చూపుతున్నాడని, కాంగ్రెస్‌ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌ అన్నారు. మండల పరిధిలోని బండోనిగూడ నుంచి షాబాద్‌ మండలం మద్దూరు శివారు వరకు ఇటీవల పూర్తి చేసిన సీసీరోడ్డు పనులను ఆయా గ్రామస్తులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం బండోనిగూడ, మద్దూరు గ్రామాల సరిహద్దులో సీసీరోడ్డును పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. మద్దూరు శివారులో భూములు, ఫాం హౌస్‌లు కలిగి ఉన్న బీఆర్‌ఎస్‌ నేత, మాజీ మంత్రి ఏనాడు ఆయా గ్రామాల అభివృద్ధిని పట్టించుకున్న పాపన పోలేదని విమర్శించారు. కేవలం తన భూమిని అభివృద్ధి పరుచుకొనుటకు ప్రభుత్వ సంపద అయిన ఎర్రమట్టిని కొల్లగొట్టిన ఘనత మాజీమంత్రికే దక్కుతుందని ఆరోపించారు.

కులసంఘాల స్థలాన్ని వదిలేయాలి

బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు లక్ష్మయ్య

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జెన్నాయిగూడ గ్రామంలో గత ప్రభుత్వం కుల సంఘాలకు ఇచ్చిన స్థలాన్ని వదిలేయాలని మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్‌ కోరారు. బుధవారం రావిర్యాల గ్రామంలో ఆయన మాట్లా డారు. రావిర్యాల గ్రామంలోని రెడ్డి, పద్మశాలి, నాయీబ్రహ్మణ, యాదవ, గంగపుత్రులు తదితర కులాలకు ఒకే ప్రదేశంలో భవనాల నిర్మాణాలకు జెన్నాయిగూడ గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చారన్నారు. ఈ స్థలం అన్ని కులాలవారు సుమారు రూ.20లక్షల వరకు సొంత డబ్బులు ఖర్చుపెట్టి భూమిని చదును చేశారన్నారు. గతంలో మంత్రిగా పని చేసిన ప్రస్తుతం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ఆ భూమిలో భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిందని విషయం ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఆ భూమిలో లెన్స్‌కార్ట్‌ పరిశ్రమను ఏర్పాటు చేశారన్నారు. తాము అభివృద్ధిని అడ్డుకోము కానీ, కులసంఘాల స్థలాన్ని వదిలివేయాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్‌ పరీక్షలు ప్రారంభం

మహేశ్వరం: మండలంలో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటిరోజు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,933 మందికిగాను 1,908 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై, 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కస్టోడియన్‌ నర్సయ్య తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభం కాగా.. విద్యార్థులు 30 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను ఇన్విజిలేటర్లు క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మహేశ్వరం పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. మాస్‌ కాపీయింగ్‌ జరగకుండా సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు.



నేదునూరు మోడల్‌ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



కొత్తగూడ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో పరీక్షా కేంద్రంలోకి వస్తున్న విద్యార్థులు

41 మంది గైర్హాజరు..

కందుకూరు: మండల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్మీడియేట్‌ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు తెలుగు పరీక్షకు 1,297 మంది విద్యార్థులకు గాను 41 మంది గైర్హాజరయ్యారు.

పెండింగ్‌ బిల్లులు చెల్లించాలి



బిల్‌స్టాప్‌ సర్వీసులను తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ సి.మాధవరెడ్డి

హుడాకాంప్లెక్స్‌: యజమానులు పెండింగ్‌లో ఉన్న బకాయిలను మొత్తం చెల్లించి తమ సర్వీసులను పునరుద్ధరించుకోవాలని సూపరిటెండెంట్‌ ఇంజినీర్‌ సి.మాధవరెడ్డి కోరారు. పెండింగ్‌ విద్యుత్‌ బకాయిలు వసూళ్లలో భాగంగా బుధవారం సరూర్‌నగర్‌ సర్కిల్‌ పరిధిలోని కొత్తపేట సెక్షన్‌లో బిల్‌స్టాప్‌ సర్వీసులను ఆయన తనిఖీ చేసి అట్టి సర్వీసు బేసిక్‌ బిల్లు రూ.75వేలను వినియోగదారుడి చేత కట్టించారు. విద్యుత్‌ బిల్లులు పెండింగ్‌ ఉన్నా, వినియోగదారులు తొలగించినా, తమకు సర్వీసులను బకాయిలు చెల్లించకుండా స్వయంగా పునరుద్ధరించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. వినియోగదారులంతా సకాలంలో బకాయిలు చెల్లించి విద్యుత్‌ సంస్థకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనరల్‌ మేనేజర్‌ పి.అంజయ్య, డివిజినల్‌ ఇంజినీర్‌ కే.రామకృష్ణ, సీనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ ఆర్‌.రమణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జాతీయ మార్కెట్‌ విధానాన్ని రద్దుచేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న పద్మ, నాయకులు

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ
- చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా, వినతిపత్రం అందజేత

చేవెళ్ల: కేంద్ర పాలకులు తీసుకొచ్చిన రైతు వ్యతిరేక జాతీయ వ్యవసాయ మార్కెట్‌ విధానాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వ్యతిరేకిస్తూ తీర్మానించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ వ్యవసాయ మార్కెట్‌ విధానాన్ని రద్దుచేయాలని, పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రుణమాఫీ చట్టాన్ని చేయాలని, విద్యుత్‌ ప్రైవేటీకరించొద్దని, కౌలు రైతులకు సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలనే డిమాండ్లతో రాష్ట్ర పార్టీ ఆదేశాలతో ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. గతంలో రైతాంగం ఉద్యమించిన ఫలితంగా ఉపసంహరించుకున్న ఈ రైతు వ్యతిరేక చట్టాలను తిరిగి దొంగదారిలో అమలు చేయటానికి కేంద్రంలో ప్రధాన మంత్రి పూనుకున్నట్లు ఆరోపించారు. ఈ విధానాలతో రైతు రక్షణ దెబ్బతినే పరిస్థితి వస్తుందన్నారు. రైతులకు మేలు చేయలేని ఇలాంటి విధానాలను తీసుకురావద్దని వెంటనే వీటిని రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. లేదంటే మళ్లీ రైతులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి. నాగిరెడ్డి, సుధాకర్‌గౌడ్‌, జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, ఎం. శివుడు, నారాయణ రెడ్డి, సత్తిరెడ్డి, సుభాన్‌రెడ్డి, అంజయ్య, సుధీర్‌, అమృత, తదితరులు పాల్గొన్నారు.

పేదల గూడు.. సమస్యల గోడు

రాజీవ్‌ గృహకల్ప ఇళ్లకు అందని మిషన్‌ భగీరథ నీళ్లు

- అధ్వానంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికారులు
- మున్సిపల్‌ ఏర్పాటుతోనైనా సమస్యలు తీరేనా?



మొయినాబాద్‌ మండలం చిలుకూరులోని రాజీవ్‌ గృహకల్ప ఇళ్లు

మొయినాబాద్‌: పేదల కలల గూడులో సమస్యల గోడు వినిపిస్తోంది. పన్నెండేళ్ల క్రితం పేదలకు ఇచ్చిన రాజీవ్‌ గృహకల్ప ఇళ్లకు మిషన్‌ భగీరథ నీళ్లు అందడంలేదు. మరోవైపు డ్రైనేజీ, వీధిదీపాలు, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గృహాలు లబ్ధిదారులకు అందించి పన్నెండేళ్లు దాటినా ఇప్పటికీ అవి హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. మున్సిపాలిటీ ఏర్పాటుతోనైనా సమస్యలు తీరుతాయో లేదో అన్ని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

2013 జనవరిలో పంపిణీ..

మొయినాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో 2006లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి పేదలకు సొంతింటి కల నెరవేర్చడం కోసం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం(జవహర్‌లాల్‌ నెహ్రూ నేషనల్‌ అర్బన్‌ రెన్యూవల్‌ మిషన్‌) పథకం కింద 992 రాజీవ్‌గృహకల్ప ఇళ్లను మంజూరు చేశారు. అందుకోసం రూ.35 కోట్ల నిధులు కేటాయించారు. 2008లో పనులు ప్రారంభమై 2012లో పూర్తయ్యాయి. 2013 జనవరిలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర హోంమంత్రి సబితారెడ్డి గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు.

బోర్ల ద్వారానే నీటి సరఫరా..

తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రభుత్వం మిషన్‌ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నల్లా నీళ్లు అందిస్తోంది. కానీ చిలుకూరులోని రాజీవ్‌ గృహకల్ప గృహాలకు మాత్రం మిషన్‌ భగీరథ నీళ్లు అందడం లేదు. దీనికి ప్రధాన కారణం ఈ గృహాలు స్థానిక పంచాయతీలో నమోదు చేయకుండా హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉంచారు. అప్పట్లో ఈ గృహాలను హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించారు. తరువాత హెచ్‌ఎండీఏ నుంచి అప్పటి గ్రామ పంచాయతీకి బదిలీ చేయాల్సి ఉండగా అలా చేయలేదు. దీంతో ఇక్కడ మిషన్‌ భగీరథ పైప్‌లైన్లు వేయలేదు. ప్రస్తుతం ఇక్కడ బోర్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు.

పంచాయతీపైనే భారం

చిలుకూరు రాజీవ్‌ గృహకల్ప ఇళ్లు అప్పట్లో గ్రామ పంచాయతీలో నమోదు కాకున్నా ఇక్కడి సమస్యల పరిష్కార భారం మాత్రం గ్రామ పంచాయతీపైనే పడుతోంది. బోర్ల ద్వారా నీటిసరఫరాతో పాటు పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ వంటి పనులన్నీ గ్రామ పంచాయతీ ద్వారానే చేయిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన సెప్టిక్‌ ట్యాంక్‌లు ప్రతి ఆరు నెలలకోసారి నిండుతుండడంతో వాటిని గ్రామ పంచాయతీ ద్వారానే ఖాళీ చేయిస్తున్నారు. ఈ ఖర్చులన్నీ గ్రామ పంచాయతీ భరించింది. అయితే ఇటీవల చిలుకూరు గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పడిన మొయినాబాద్‌ మున్సిపాలిటీలో విలీనమైంది. ఇప్పుడు రాజీవ్‌ గృహకల్ప ఇళ్లు కూడా మున్సిపాలిటీలో విలీనమయ్యాయా లేదా అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు. ఇక్కడి సమస్యలను మున్సిపాలిటీ అధికారులు మాత్రం ఇప్పుడు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా హెచ్‌ఎండీఏ అధికారులు ఈ గృహాలను మున్సిపాలిటీకి అప్పగిస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

తాగునీటిని కొనుక్కుంటున్నాం

చిలుకూరు రాజీవ్‌ గృహకల్ప ఇళ్లకు మిషన్‌ భగీరథ నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. ఇళ్లలో వాడుకోవడానికి బోరు నీళ్లు వస్తున్నాయి. తాగేనీళ్లు మాత్రం కొనుక్కుంటున్నాం. పారిశుద్ధ్య నిర్వహణ సరిగాలేదు. ఇళ్ల మధ్యే చెత్తాచెదారం వేయాల్సి వస్తోంది. వీధి దీపాలు సరిగా వెలగడంలేదు.

– కాడిగళ్ల కృష్ణ, రాజీవ్‌ గృహకల్ప, చిలుకూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



చిలుకూరులో ఉన్న జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయానికి సంబంధించి నీటి సమస్య విషయం మా దృష్టికి రాలేదు. గతంలో గ్రామ పంచాయతీలో లేకుంటే.. మా మున్సిపాలిటీ పరిధిలో కూడా లేనట్లే. అయినా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– మహ్మద్‌ ఖాజామొయిజుద్దీన్‌, కమిషనర్‌